# ★ ప్రేమ సమాగం ★

శ్రీమతి అరుణ

నాటకం ప్రారంభించారు. అంతా ఉత్సాహంగా చూస్తున్నారు. నేనూ చూస్తున్నాను.

పక్కనెవరో- నాటకంలోని ప్రేయసీ ప్రియుల ఎడబాటుచూసి కన్నీరు కారుస్తున్నది. ముక్కు ఒక్కమాటు ఎగపీల్చి మళ్ళీ సరైన స్థితిలోకి వచ్చింది.

కొంచెంసేపు గడిచింది. నాచేతిమీద ఏదో బరువు పెట్టినట్లయి, పక్కకు చూశాను. పద్దెనిమిదేళ్ళ యువతి కూర్చుని ఉంది, ఇందాక కన్నీరుకార్చినామే ! పాపం ! ఆమెకుకూడా ఇలాంటిదేదో అనుభవమై ఉండాలి అనుకుని నాచేతిమీద ఉన్న ఆమె చేతిని తొలగించి, సర్దుకుని కూర్చున్నా. మళ్ళీ కొంచెం సేపయినతరువాత ఆమె నామీద చెయ్యివేసింది. అబ్బ ! ఏమిటీగోల ! ఎవరిమీదనో ఉన్న విరహబాధను నామీద చూపెట్టి నన్ను చంపేస్తున్నది. కానీ ఆమె మృదు హస్తాన్ని ఈమారు తొలగించలేక పరధ్యానంగా ఉన్నట్లు నటిస్తూ, నాటకం చూస్తున్నా.

క్షణం గడిచింది. సీను అయిపోయింది. మళ్ళీ సీనుకోసం అంతా ఎదురు చూస్తున్నారు. హఠాత్తుగా కోమల కంఠం వినిపించింది.

"ఇందాక నాచేతినెందుకు విడిపించుకున్నారు?"

పెంకెగా జవాబిచ్చాను- "అపరిచితుల హస్తాలతో హస్తాలు కలిపి, అందులో ఆడవాళ్ళతో- కూర్చోవటం మాకు అలవాటులేదు."

ఆమె నిశ్చలంగా మళ్ళీ అడిగింది- "అలవాటుంటే తొలగించేవారు కారన్నమాట?"

"ఏమో ! అది ఈపరిస్థితిలో చెప్పలేనిది".

"పోని ఇప్పుడు అలవాటైందిగా !"

"లేదు" అన్నా ఆలోచించకుండా.

ఒచ్చే నవ్వు ఆపుకుంటూ ఆమె అన్నది- "నేను అలవాటు చేస్తాలెండి".

నాకేమీ జవాబు తోచలేదు. మాట్లాడకుండా వాచీ సరి జేసుకుంటూ కూర్చున్నా.

నాటకం అయిపోవచ్చింది. మళ్ళీ నాచేతిమీద చెయ్యి పడ్డది. ఈసారి గట్టిగా నాచేతినికూడా నొక్కింది. క్షణమయాక, నాటకంమీదనే దృష్టి నిలిపి, నాచెవిలో "నేను ఎవర్నో మీకు తెలీదు. కానీ ఒక అపరచితుణ్ణి ప్రేమించి దాని పర్యవసాన మెలా ఉంటుందో ఊహించుకోలేని ఒక అభాగిని ఉందనీ, ఒకనాడు నాటకంలో ఆమెకు అతని పక్కన కూచోగలిగే భాగ్యం లభించిందనీ- క్షణికమైన ఆ ఆనందాన్ని జీవితాంతం వరకూ ఆమె మరిచిపోలేదని మాత్రం జ్ఞాపకముంచుకోండి.—" అన్నది అశ్రుదద్ధ కంఠంతో.

రోజులు గడిచినయ్. ఆమెను నేను పూర్తిగా మరచిపోకపోయినా, మర్చిపోయినవాళ్ళలోనే లెక్క.

సెలవలకు ఊరికెళ్ళటానికి రైలెక్కుతున్నాను. స్టేషన్ మాష్టర్‌తో చిరపరిచితురాలిలా ఎవరో మాట్లాడుతున్నారు. రైలెక్కి, తలుపు దగ్గర సిగరెట్ కాలుస్తూ నుంచున్న నాదృష్టి ఆమెమీద పడింది. ఎక్కడో చూసినముఖం ! కాస్త జ్ఞాపకం రావటంలేదు. హఠాత్తుగా ఆమె నవ్వు ముఖంతో నన్నుచూసి నిశ్చేష్టురాలైపోయింది. మాట్లాడుతున్న మాటల్ని ఆపేసింది. ఆమెను నవ్వించిన స్టేషన్ మాష్టర్ తెల్లబోయాడు. చేతిలో ఉన్న పర్సును ఇంకో చేతిలోకి తీసుకుంటూ ఆమె సీరియస్‌గా స్టేషను మాష్టరుతో ఏదో అని నావైపుకు వచ్చింది. కానీ రైలు కదిలిపోయింది. అప్పుడు చూశాను ఆమె ముఖాన్ని ! అందమంతే అదే ! ముఖం భంగిమ ఒక్కమారుగా మారిపోయింది. కనుకొలుకుల్లో ముత్యాల్లా కన్నీరు నిల్చిఉంది. చివరకు కళ్ళనిండా నీళ్లు నింపుకొని, చైతన్యరహితంగా చేయి ఊపింది నన్నుచూసి. కానీ నేను లక్ష్యపెట్టనట్లూ, నాకు దేనిమీదా మమత లేనట్లూ ముఖం తిప్పేసుకున్నా.

ఇంటికి వెడితే అమ్మ "పెళ్ళి చేసుకోరా నాయనా !" అన్నది. నాకు నిజంగా పెళ్ళిధోరణిలేదు. అందుకని

అమ్మ ఆమాట అన్నప్పుడల్లా ఒక్క నవ్వు నవ్వి వెళ్ళి పోయేవాణ్ణి. నాటకంలో తటస్థపడ్డ ఆయువతి నా ఊహా లోకంలోంచి ఎప్పుడో మాయమైపోయింది.

సెలవలు పూర్తయినయ్. మళ్ళీ మెడ్రాసుకొచ్చాను. రూము తలుపు తెరచేసరికి, పక్కరూములో ఉన్న సహాధ్యాయి శంకరం వచ్చి ఏవో రెండు ఉత్తరాలిచ్చివెళ్ళేడు. అవి జేబులో పెట్టుకుని సామాను లోపల పెట్టించి, తిన్నగా కాఫీహోటలువైపు దారితీశాను. కాఫీ తాగుతూ నిదానంగా జేబులో ఉత్తరాలు తీశాను. మొదటి ఉత్తరంలో విశేషాలేమీలేవు. చిరాగ్గా లోపలపెట్టేశాను. రెండోది తీశాను. చదివి ఆశ్చర్యపోయాను. నేను చెడ్డదారిన పడుతున్నానేమో అనిపించింది.

……………………గారికి,

మహాశయా ! మీరు ఆదర్శపాత్రులు, రచయితలు. కానీ, ఒక స్త్రీయొక్క నిష్కల్మష ప్రేమను కనుసైగలతో తిరస్కరించేశారు. పోనీలెండి. నాలా ఇంతచిత్రంగా ప్రేమించేవాళ్ళెవరూ ఉండకపోవచ్చు. నేను కులంలోదాన్ని కాదనేమోకదూ మీ భయం? నేనూ ఉత్తమ కులసంజాతనే ! మా నాన్న ఒక డాక్టరు, సంస్కారి, కులమత భేదాల్ని మరిచి అంతర్వివాహాలు చేసుకోటం ఆయనకు ఇష్టం. ఆయన అలానే చేశారుకూడా ! అందువల్లనే నేను ధైర్యంగా ఒక అపరిచితుడైన రచయితను, అందగాణ్ణి ప్రేమించాను. నాసంగతి మానాన్నగారికి తెలియదు. తెలిస్తే అంగీకరించరనే భయం నాకు లేదు. ఆనాడు నాటకంలో మిమ్మల్ని చూసి, నాటకం మొదలుపెట్టగానే మీపక్కకొచ్చి కూర్చున్నాను.

“నేను మీకెలా తెలుసు?” అని మీరడగవచ్చు. కానీ ఏముంది అందులో? అందరికీ అందరూ ఎలా పరిచయమౌతారో అలానే నేను మీకు పరిచయమైనాను. అంతకంటే చెప్పుకోదగ్గ విశేషమేమీ లేదు. ప్రేమ భగ్నానికి దారితీస్తుందనే ప్రస్తుతపు నా నిర్ణయం. మీకు కష్టం కలిగించుతున్నట్లయితే ఈ ప్రసక్తిని ఇంతటితో ఆపేస్తాను. కానీ ఆనాడు నాటకంలో ఎంతో ప్రయత్నంమీద మీకు చెప్పగలిగిన ఆ నామాటల్ని మరచిపోకండి. నన్ను మరచిపోయినా, కనీసం ఒక ఊరు, పేరు లేని యువతి ‘వాక్కులు’ అని అయినా స్మరించుకోండి. బ్రహ్మచారిణినై బతకగల ధైర్యం నాకుంది. క్షమించండి. ఇంక నేనేమీ వ్రాయదల్చుకోలేదు. అంతా నాలోనే ఇముడ్చుకుని, శివుడు గరళాన్ని మింగి కంఠంలో దాచుకున్నట్లు, నేనూ నా బాధనంతా కడుపులో దాచుకోగలను. ఇదికూడా రాయకూడదనే అనుకున్నాను. కానీ కలం అప్రయత్నంగా ఇంతవరకూ నడిచింది. అర్థంలేని ఈ లేఖను చదివి తిరస్కార సూచకంగా నవ్వుకుంటారనుకుంటాను. మరి సెలవు.

……………………

ఉత్తరం చదవటమైపోయింది. ఆక్షణంలో నేను అమితంగా బాధపడ్డమాట నిజమే ! నాలో ఇప్పుడే వెళ్ళి ఆమెతో “నీకు చాలా అన్యాయం చేశాను” అని చెప్పి ఆమెనే అర్థాంగినిగా స్వీకరించుదామనుకున్నాను. కానీ ఎక్కడికని వెళ్ళను? ఏమని తిరగను? ఆమె ఎడ్రెస్సన్నా ఇవ్వలేదు. దాంతో ఆనాడు పిచ్చివాడికిమల్లే అంతా తిరిగాను ఆమె ఎక్కడైనా కనిపిస్తుందేమోనని. కానీ ఏమీ జాడలేదు.

ఎండాకాలం వచ్చింది. సెలవలిచ్చారు. ఊరికి బయల్దేరాను. రైలెక్కుతూ మళ్ళీ ఆస్టేషన్ మాష్టర్ వైపు చూశాను. ఇప్పుడాయన ప్రక్కన ఎవ్వరూలేరు. ఆయన ఎవరినీ నవ్వించటంలేదు. సీరియస్‌గా టిక్కెట్లు కలెక్టు చేస్తున్నాడు.

ఊరికెళ్ళేసరికి అమ్మ ఒక సంబంధాన్ని తెచ్చింది. నాతో చెప్తే ఇక లాభంలేదనుకొని తనే ఒకటి స్థిరపరిచింది. ఇది విన్నాక నేను మనసులో ఆమెనుగూర్చి కొంచెం చింతపడ్డాను. కాని పిల్లను చూచినతర్వాత అది కాస్తా ఎటో పోయింది. మళ్లీ “అమ్మతో చెప్పి ఆమెను చేసుకుంటే మాత్రం ఏం? ఏకైక పుత్రుడిమీద ప్రేమవల్ల అంతమాత్రానికైనా ఒప్పుకోదా?” అనుకున్నా. కానీ మరుక్షణమే నాలో ఏదో శక్తి “ఛీ ! ఎవరో ముక్కూ, మొహమూ ఎరుగనివాళ్లు, ఏదో ప్రేమించేశారని పిచ్చిగా నమ్ముతావా?” అని నన్ను అణచేసింది.

అమ్మ సంతోషంగా చూస్తున్నది. పెళ్ళి బాజాలు మోగుతున్నయ్. అంతా హడావిడిగా ఉంది. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. మంగళసూత్రం కడుతున్నాను వధువుమెళ్ళో. మంగళసూత్రాన్ని పూజచేసి కూర్చున్నాను. ఏదో హస్తం దీవిస్తున్నట్లూ, మొహం వికసించి లక్ష్మీదేవిలా ఉంది, చిరునవ్వుతో “నాప్రేమను విశ్వసించలేవుకదూ? పోనీ … ఇవిగో మీయిద్దరికీ నా శుభాకాంక్షలు!” అని ఆదేశిస్తున్నట్లు తోచింది. ఉన్నట్లుండి కళ్ళు చెమ్మగిల్లినయ్.

—★—